



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
03-02-2025
పేజీలు: 02


# సుప్రీంలో ఎమ్మెల్యేల అనర్హత కేసు విచారణ..
# పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు
# సుప్రీం నోటీసులు



తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత కేసు విచారణ సుప్రీంకోర్టులో ఈనెల10వ తేదీకి వాయిదాపడింది. ఈ కేసును మొన్నటి ముగ్గురు ఎమ్మెల్యేల కేసుతో ట్యాగ్ చేసింది సుప్రీం ధర్మాసనం. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్‌చంద్రన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ తర్వాత ఈ కేసు ఈనెల పదో తేదీకి వాయిదాపడింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సుప్రీం నోటీసులు జారీ చేసింది. పోచారం, సంజయ్, మహిపాల్‌రెడ్డి, అరెకపూడి గాంధీ, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి నోటీసులు పంపింది. కారు గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీకి టచ్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ పోరాటం చేస్తోంది. ఇప్పటికే తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్, కడియం శ్రీహరిపై సుప్రీంలో విచారణ జరుగుతోంది. జనవరి 31న ఈ పిటిషన్‌పై సుప్రీంలో విచారణ జరిగింది. తాజాగా పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, టి.ప్రకాష్ గౌడ్, అరికపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ఎం.సంజయ్ కుమార్‌పై బీఆర్ఎస్ పిటిషన్ వేసింది. బీఆర్ఎస్ బీఫామ్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై ఇంతవరకు స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది బీఆర్ఎస్. అయితే పార్టీ ఫిరాయింపులపై గతంలోనే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది బీఆర్ఎస్ పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తప్పదంటూ బీఆర్ఎస్ నేతలు కూడా ధీమాతో ఉన్నారు.. అందుకు తగ్గట్టే, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై.. నాలుగువారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ అప్పట్లో స్పీకర్‌ను ఆదేశించింది తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్. అయితే, పార్టీ మారిన ఎమ్మెల్యేలు.. ఈ తీర్పును సవాల్ చేస్తూ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు డివిజన్ బెంచ్... ఈ అంశంలో కీలక వ్యాఖ్యలు చేసింది. పార్టీమారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సెప్టెంబర్ 9న సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం 10వ షెడ్యూల్.. అసెంబ్లీ ఐదేళ్ల గడువును దృష్టిలో పెట్టుకుని.. స్పీకర్ తగిన నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు చెప్పింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సుప్రీంకోర్టు గడప తొక్కింది. సుప్రీం కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనేది సర్వత్రా ఆసక్తిగా మారింది.



## ప్రళయ కాల రుద్రుడిగా ప్రభాస్.. 'కన్నప్ప' నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కీలక పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కన్నప్ప. మంచు కుటుంబం నుంచి వస్తున్న ఈ మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తుండగా.. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నాడు. ఏప్రిల్ 25న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా మూవీ నుంచి సాలిడ్ అప్‌డేట్‌ని ప్రకటించింది. ఈ మూవీ నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో రుద్రుడిగా ప్రభాస్ నటించబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ విడుదల చేసింది. ప్రళయ కాల రుద్రుడు.. త్రికాల మార్గదర్శకుడు, శివాజ్ఞ పరిపాలకుడు అంటూ ప్రభాస్ పోస్టర్‌ని పంచుకుంది. హిస్టారికల్ కం మైథాలాజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ అందుకుంది.









## 15న పార్లమెంటులో 'రామాయణం' ప్రదర్శన

'రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ' యానిమేటెడ్ చిత్రాన్ని ఈ నెల 15న పార్లమెంటులో ప్రదర్శించనున్నట్లు గీక్ పిక్చర్స్ వెల్లడించింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, పార్లమెంటు సభ్యులు, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపింది. 1993లో ఈ సినిమాను ఇండో-జపనీస్ టీమ్ తెరకెక్కించింది. 24వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో ప్రదర్శించారు. రచయిత విజయేంద్రప్రసాద్ ఈ మూవీకి రైటర్‌గా పనిచేశారు.

## కీరోల్ మన త్రిషదే!

అండర్-19 టీ20 వరల్డ్ కప్‌లో భారత మహిళల జట్టు ఘన విజయం సాధించి, కప్ కొట్టిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో అద్భుతంగా ఆడిన తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిషపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. టీమిండియా వరల్డ్ కప్ సాధించడంలో త్రిష కీలక పాత్ర పోషించింది. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. త్రిష ఆల్‌రౌండర్‌గా రాణించింది. ఫైనల్ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును సొంతం చేసుకోవడం మాత్రమే కాదు.. ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డును కూడా గెలుచుకుంది. అండర్-19 టీ20 వరల్డ్ కప్‌లో త్రిష టోటల్ 309 పరుగులు చేసింది. అలాగే 7 వికెట్లు తీసుకుంది. అండర్-19 టీ20 వరల్డ్ కప్‌లో సెంచరీ చేసిన త్రిష.. ఈ టోర్నీ మొత్తంలో సెంచరీ చేసిన తొలి ప్లేయర్ ఈమెనే కావడం గమనార్హం. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్ గ్రహీత, వుమెన్స్ జట్టు మాజీ క్రికెటర్ నీతూ డేవిడ్ చేతుల మీదుగా ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డును త్రిష అందుకుంది. ఈ అవార్డు రావడం పట్ల త్రిష సంతోషం వ్యక్తం చేసింది. ఈ అవార్డును తన తండ్రికి అంకితం చేస్తున్నట్టు వెల్లడించింది. తన కెరీర్ మొత్తాన్ని ఆల్ రౌండర్ గానే కొనసాగిస్తానని వెల్లడించింది. భద్రాచలంలో జన్మించిన త్రిష.. 2 సంవత్సరాల వయసుకే బ్యాట్ పట్టింది. ఆమెకు తొమ్మిది ఏండ్లు ఉన్నప్పుడు హైదరాబాద్ అండర్-16 జట్టుకు సెలెక్ట్ అయ్యింది. అప్పుడు అద్భుత ప్రదర్సన ఇచ్చి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. ఆ తర్వాత అండర్-23 కేటగిరీలోనూ సత్తా చాటింది. ఇటు బౌలింగ్, అటు బ్యాటింగ్‌లోనూ అదుర్స్ అనిపిస్తుంది.



## నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

గత వారం లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు ఇవాళ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం సెన్సెక్స్ 620 పాయింట్ల నష్టంతో 76,895 వద్ద, నిఫ్టీ 211 పాయింట్లు నష్టపోయి 23,260 వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 87.16గా ఉంది.

## శక్తిమంతమైన టూల్‌ను తీసుకొచ్చిన ఓపెన్ ఏఐ

ఆన్‌లైన్‌లో రీసెర్చ్ చేయగల డీప్ రీసెర్చ్ అనే శక్తిమంతమైన టూల్‌ను ఓపెన్ ఏఐ తీసుకొచ్చింది. అత్యంత కష్టమైన పరిశోధనను కూడా ఈ టూల్ సమర్థంగా పూర్తి చేస్తుందని ఓపెన్ ఏఐ తెలిపింది. 'మనిషి గంటల తరబడి చేసే పనిని డీప్ రీసెర్చ్ కేవలం నిమిషాల వ్యవధిలో చేయగలదు. ఒక ప్రాంప్ట్ ఇస్తే చాలు. నెట్టింట సమాచారాన్ని క్రోడీకరించి, విశ్లేషించి నివేదికను రిసెర్చ్ అనలిస్ట్ స్థాయిలో తయారుచేసి మీకు అందిస్తుంది' అని పేర్కొంది.

## 'లక్కీ భాస్కర్' తరహాలో డబ్బు సంపాదించాలనుకుని..

లక్కీ భాస్కర్ మూవీలో హీరో బ్యాంకు సొమ్మును వాడుకుని మనీ సంపాదిస్తాడు. అదే తరహాలో చేయాలనుకుని ఓ ఉద్యోగి పోలీసులకు చిక్కాడు. మార్కాపురంలోని సచివాలయ కార్యదర్శి P.వెంకటేశ్వర్లు పింఛన్ల సొమ్ము ₹2.66L తీసుకుని JAN 31న పారిపోయాడు. వివిధ బెట్టింగ్ యాప్‌లలో పెట్టి ఒక్క రోజులోనే ₹10L సంపాదించాలనుకుని మొత్తం పోగొట్టుకున్నాడు. బంధువులు డబ్బు చెల్లించడంతో పోలీసులు అతడిని హెచ్చరించి వదిలేశారు.

## కుంభమేళాలో భక్తుల భద్రతపై నేడు సుప్రీంలో విచారణ

కుంభమేళాలో ఇటీవల జరిగిన తొక్కిసలాటపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఇవాళ విచారించనుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గైడ్‌లైన్స్ ఇవ్వాలని పిటిషనర్ కోర్టును కోరారు. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రత్యర్థులుగా పిటిషనర్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లలో తగ్గుతున్న అడ్మిషన్లు.. సర్కార్ కీలక నిర్ణయం

ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల గురించి సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సర్కార్ విద్యాసంస్థల్లో అందిస్తున్న సౌకర్యాలు, వస్తున్న ఫలితాల గురించి ప్రజలకు తెలిసేలా వివరించనుంది. అడ్మిషన్లు పెరిగేలా చర్యలు చేపట్టనుంది. దీనికోసం FB, X, WHATSAPP వంటి సోషల్ మీడియా వేదికల్లో స్పెషల్ గ్రూపులను క్రియేట్ చేయనుంది. వీటిని స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారని సమాచారం.

## తిరుమలలో రథసప్తమి ఏర్పాట్లు

రేపు రథ సప్తమి సందర్భంగా తిరుమలలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అష్టాదళ పాదపద్మారాధన, కళ్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు, ఊంజల్ సేవల్ని టీటీడీ రద్దు చేసింది. అటు ఎన్ఆర్ఐలు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు కేటాయించే ప్రత్యేక దర్శనాలను, నేటి నుంచి 3రోజుల వరకూ స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లను రద్దు చేసింది. నేడు సిఫార్సు లేఖల్ని స్వీకరించబోమని టీటీడీ వర్గాలు పేర్కొన్నాయి.

## ముద్రగడకు వైఎస్ జగన్ పరామర్శ

వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డిని మాజీ సీఎం జగన్ ఫోన్‌లో పరామర్శించారు. నిన్న ఆయన నివాసంపై దాడి జరిగిన ఘటన గురించి వివరాలు తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని అన్నారు. ఆయనకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిన్న తెల్లవారుజామున మద్యం మత్తులో ఓ యువకుడు ముద్రగడ ఇంటిని ట్రాక్టర్‌తో ఢీకొట్టిన సంగతి తెలిసిందే.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# అమెరికా మాజీ అధ్యక్షుడికి గ్రామీ అవార్డు

సంగీత రంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే గ్రామీ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరుగుతోంది. లాస్ ఏంజెల్స్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకకు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న గాయనీ గాయకులు, మ్యూజిక్ డైరెక్టర్లు హాజరై సందడి చేస్తున్నారు. రెడ్ కార్పెట్‌పై నడుస్తూ ఫొటోలకు ఫోజులిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఇక ఈ వేడుకల్లో అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్‌కు గ్రామీ పురస్కారం వరించింది. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత అయిన జిమ్మీ కార్టర్ (100) గతేడాది డిసెంబర్ 30న కన్నుమూసిన విషయం తెలిసిందే. మరణానంతరం ఆయనకు ఈ పురస్కారం వరించింది. ఆయన రచించిన 'ది లాస్ట్ సండేస్ ఇన్ ప్లేన్స్'కు బెస్ట్ ఆడియోబుక్ నెరేషన్ విభాగంలో అవార్డు లభించింది. ఈ అవార్డును ఆయన మనవడు జేసన్ కార్టర్ అందుకున్నారు. జిమ్మీ కార్టర్ అమెరికాకు 39వ అధ్యక్షుడిగా పని చేశారు. తన పదవీకాలంలో ప్రపంచ శాంతి కోసం ఆయన కృషి చేశారు.

1979లో ఈజిప్ట్, ఇజ్రాయెల్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించారు. చైనాతో దౌత్యపరమైన సంబంధాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు అమెరికా విదేశాంగ విధానంలో మానవ హక్కులకు ప్రాధాన్యం కల్పించారు. 1980 ఎన్నికల్లో ఆయన ఓడిన తర్వాత పూర్తిస్థాయిలో ప్రపంచ శాంతికి కృషి చేశారు. దీంతో 2002లో ఆయనకు నోబెల్ శాంతి బహుమతి లభించింది.



## ఆమె కామెంట్స్ ను తప్పుపట్టిన ప్రగ్యా జైస్వాల్ !

బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్ పై దాడి విషయంలో హాట్ బ్యూటీ ఊర్వశీ రౌతేలా నెగిటివ్ కామెంట్స్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం ఆమె క్షమాపణలు కూడా చెప్పింది. ఈ నేపథ్యంలో ఊర్వశీ రౌతేలా మాట్లాడిన తీరును మరో హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ తప్పుపట్టారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ప్రగ్యా జైస్వాల్ ఈ విషయం పై మాట్లాడుతూ.. 'గొప్ప చిత్రాల్లో భాగమై.. గొప్ప నటీనటులతో కలిసి వర్క్ చేస్తున్నప్పుడు కచ్చితంగా గౌరవంగా మాట్లాడాలి. ఎంతో బాధ్యతాయుతంగా మాట్లాడాలి. కామెంట్ చేసేముందు జాగ్రత్తగా ఉండాలి' అని ప్రగ్యా జైస్వాల్ చెప్పుకొచ్చింది. ప్రగ్యా జైస్వాల్ ఇంకా మాట్లాడుతూ.. 'ఎలాంటి పరిస్థితుల్లో అయినా సరే, ఇతర నటీనటుల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలి. ఊర్వశీ రౌతేలా లాగా మరీ అంత కఠినంగా ఉండకూడదు. ఏది ఏమైనా ఆమె క్షమాపణలు కూడా చెప్పడం మంచిదైంది. నేను మాత్రం అలాంటి కామెంట్స్ కి సపోర్ట్ చేయను. ఇక ప్రస్తుతం నా సినీ కెరీర్ చాలా బాగుంది. నాకు వరుస విజయాలు వస్తున్నాయి. ఇంకా గొప్ప చిత్రాల్లో నటించాలి' అంటూ ప్రగ్యా జైస్వాల్ కామెంట్స్ చేసింది.

## రక్తమోడిన నగరి రోడ్డు.. నలుగురు మృతి, 10 మందికి గాయాలు

చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. మరో 10 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి చెన్నై జాతీయ రహదారిలోని నగరి ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలోనే ఈ ప్రమాదం జరిగింది. నగరి నుంచి తిరుపతికి వెళుతున్న ఒక ప్రైవేటు బస్సు.. ఓ ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో ఎదురుగా ఓ లారీ ఢీకొట్టుకుంటూ వెళ్లింది. . వేగంగా ఢీకొనడంతో బస్సులో ఒకవైపు కూర్చున్న ప్రయాణికులే ప్రమాదానికి గురయ్యారు. నలుగురు అక్కడికక్కడే మృతిచెందిగా మరికొద్దిమంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో వడమాలపేట మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పార్థసారథి, రాజేంద్ర నాయుడు తోపాటు తిరుపతికి చెందిన 8 ఏళ్ల మణికంఠ తో పాటు 60 ఏళ్ల వయసున్న మరో వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ తమిళనాడుకు చెందిన చిన్నమలై పరిస్థితి విషమంగా ఉండగా.. క్షతగాత్రులను నగరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



## అది నా ఇష్టం.. అడగడానికి మీరెవరు

బుల్లితెర నుంచి వెండితెర మీదికి ఎంట్రీ ఇచ్చి మంచి డిమాండ్ సంపాదించింది అనసూయ భరధ్వాజ్. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీ అయిపోయింది ఈ బ్యూటీ. చాలా ఆఫర్లు వచ్చినా ఆచితూచి పాత్రల్ని ఎంచుకుంటోంది. ఇక ఎప్పటికప్పుడు వివాదాస్పద కామెంట్స్ కూడా చేస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనసూయ క్రేజీ కామెంట్స్ చేసింది. అనసూయ మాట్లాడుతూ.. 'నా బట్టలు నా ఇష్టం. బికినీ వేసుకుంటా.. లేదంటే విప్పుకొని తిరుగుతా.. అది నా ఇష్టం.. అడగడానికి మీరెవరు' అంటూ నెటిజన్ల పై సీరియస్ అయింది. ఐతే, అనసూయ కామెంట్స్ పై మాత్రం నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. ఆ కామెంట్స్ కి కూడా సాలిడ్ కౌంటర్ ఇస్తూ.. 'కెరీర్ పరంగా మూవీస్ పరంగా మీ సలహాలను నేను స్వీకరిస్తాను, ఇంప్రూవ్మెంట్ చేసుకుంటాను. కానీ, నా వ్యక్తిగత విషయాలు మీకెందుకు ?' అంటూ అనసూయ చెప్పుకొచ్చింది.



## త్వరలోనే గజ్వేల్‌లో కేసీఆర్ భారీ సభ!

ఏడాది కాలంగా ఇంటికే పరిమితమైన మాజీ సీఎం కేసీఆర్ త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి రానున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలపై గజ్వేల్‌లో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహణకు యోచిస్తున్నారు. అనువైన స్థలం కోసం పార్టీ శ్రేణులు వెతుకుతున్నట్లు సమాచారం. రైతు రుణ మాఫీ, రైతు భరోసా, నేతన్నలు, అన్నదాతలు, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై కేసీఆర్ ప్రభుత్వాన్ని నిలదీస్తారని తెలుస్తోంది.

## కచిడి చేప @3.95 లక్షలు

కాకినాడ వద్ద సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులను అదృష్టం వరించింది. అరుదైన కచిడి చేప వారికి కాసులు కురిపించింది. 25కేజీల చేప వేలంలో రూ.3.95 లక్షలు పలికింది. దీని శాస్త్రీయ నామం ప్రొటోనిబియా డయాకాన్తస్. కుట్లు వేసేందుకు వాడే దారాన్ని ఈ చేప పొట్ట భాగం నుంచే తయారు చేస్తారు. సౌందర్య సాధనాల తయారీలో వినియోగిస్తారు. ఖరీదైన వైన్లను శుభ్రం చేయడానికి ఈ చేప రెక్కలను వాడతారు. అందుకే ఈ ఫిష్‌కు డిమాండ్.





## చేనేత కార్మికులకు గుడ్ న్యూస్

నేత కార్మికులకు 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. గతంలో నిర్మించిన వీవింగ్ షెడ్లలో పవర్ లూమ్స్ బిగించి లబ్ధిదారులకు ఇవ్వనుంది. త్వరలోనే అర్హులను గుర్తించి తొలుత సిరిసిల్ల జిల్లాలో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఒక యూనిట్ కింద ₹8L విలువైన 4 లూమ్స్ ఇస్తారు. యూనిట్ విలువలో 50% సబ్సిడీ, 40% బ్యాంక్ లోన్, 10% లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుందని సమాచారం.



## విడుదలైన ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్.. నామినేషన్లు షురూ

రాష్ట్రంలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వెంటనే నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైంది. ఈ నెల 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామపత్రాలను దాఖలు చేయవచ్చు. 11న నామినేష్ల పరిశీలన, 13న సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. 27న పోలింగ్ జరుగుతుంది. వచ్చేనెల 3న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే.

నామినేషన్ ప్రక్రియ: ఫిబ్రవరి 3 నుంచి 10 వరకు
నామినేషన్ల పరిశీలన: ఫిబ్రవరి 11
నామినేషన్ల ఉపసంహరణకు గడువు: ఫిబ్రవరి 13
పోలింగ్: ఫిబ్రవరి 27 (ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు)
ఫలితాలు: మార్చి 3

ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ, కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లా పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీల స్థానాలు ఖాళీఅవనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం




నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల అధికారులుగా నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి వ్యవహరిస్తారు. ఖమ్మం-వరంగల్-నల్లగొండ ఉపాధ్యాయ స్థానానికి సంబంధించిన నామినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లో స్వీకరిస్తున్నారు. మూడు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 12 కొత్త జిల్లాలున్నాయి. 24,905 మంది ఓటర్లుండగా.. 191 మండలాల్లో 200 పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో 3,41,313 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో ముగ్గురు థర్డ్ జెండర్లు కూడా ఉన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ ఓటర్లు 25,921 మంది ఉన్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రుల కోసం 499, ఉపాధ్యాయ ఓటర్లకు 274 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.